# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 01 సంచిక : 285 | ఎడిటర్.: మన్నే లక్ష్మణ్ | వెల:5/- | పేజీలు: 8 | బుధవారం 05-08-2026


## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి




- నూతన భవనాలను ప్రారంభించిన మంత్రి సీతక్క
- కష్టపడి చదివి రాష్ట్రంలో తొలి స్థానంలో నిలవాలని పిలుపు

2

## ఎల్‌నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన

- విపరీత వాతావరణంపై సీఎం ఆదేశం
- లోటు వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సూచన



2

# వర్షాలతో నగరానికి భారీ ఊరట

- హైదరాబాద్‌లో వర్షపాత లోటు 18 శాతానికి తగ్గుదల
- కొన్ని ప్రాంతాల్లో ఇంకా సాధారణం కంటే తక్కువ వర్షా లు
- ఆగస్టు 10 వరకు ఎల్లో అలర్ట్ జారీ
- భారీ వర్షా లు, పిడుగులపై వాతావరణ శాఖ హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

గత వారం రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో హైదరాబాద్ నగరంలో వర్షపాత లోటు గణనీయంగా తగ్గింది. వారం క్రితం 34 శాతంగా ఉన్న లోటు ప్రస్తుతం 18 శాతానికి చేరిందని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) వెల్లడించింది. ఈ రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణంగా 297.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 245 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో మిగతా 2 లో..





# ఈ20 పెట్రోల్‌కు పంజాబ్ బ్రేక్

## ఈ20 పెట్రోల్‌పై అసెంబ్లీ తీర్మానం

- సాధారణ పెట్రోల్ కూడా ఇవ్వాలన్న డిమాండ్
- నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలన్న సూచన
- భగవంత్ మాన్ ఆరోపణలు

**చండీగఢ్, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి) :**

దేశవ్యాప్తంగా అమలవుతున్న ఈ20 పెట్రోల్ విధానంపై పంజాబ్ అసెంబ్లీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 20 శాతం ఇథనాల్ మిశ్రమంతో కూడిన ఈ20 పెట్రోల్ వినియోగాన్ని దేశవ్యాప్తంగా నిలిపివేయాలని కోరుతూ మంగళవారం అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించింది. వినియోగదారులకు ఈ20 పెట్రోల్‌ను బలవంతంగా వినియోగించే పరిస్థితి లేకుండా, ఇథనాల్ లేని సాధారణ పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ20 పెట్రోల్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సమయంలో పంజాబ్ అసెంబ్లీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, ఈ20 పెట్రోల్‌కు అనుకూలంగా రూపొందించని పాత వాహనాల్లో ఇథనాల్ మిశ్రమ ఇంధనం వినియోగించడం వల్ల ఇంజిన్ పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. మైలేజీ తగ్గడం, ఇంధన వ్యవస్థలో సాంకేతిక లోపాలు తలెత్తడం, నిర్వహణ వ్యయం పెరగడం వంటి సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. మిగతా 2 లో..




## తుంగతుర్తి కాంగ్రెస్‌పై జగ్గారెడ్డి నివేదిక

ఏడు పేజీల నివేదికను పీసీసీకి సమర్పణ

2



## రహ్మాత్ పాషాను అభినందించిన కేటీఆర్

బోండీ ఘటనలో ధైర్యసాహసాలకు ప్రశంసలు



2

- 20 మంది ప్రాణాలు కాపాడిన హైదరాబాద్ యువకుడికి అభినందనలు
- యువతకు రహ్మత్ పాషా స్ఫూర్తిగా నిలుస్తారని కేటీఆర్ వ్యాఖ్య



## కాళేశ్వరమే రాష్ట్రానికి ఆధారం!

- కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలని జీవన్‌రెడ్డి డిమాండ్
- కాంగ్రెస్ మంత్రుల తీరుపై విమర్శలు
- సాగు, తాగునీటి అవసరాలకు కాళేశ్వరం కీలకమని వ్యాఖ్య
- ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని పిలుపు


2

## మునుగోడుకు మెరుగైన వైద్య సేవలు

- ఆస్పత్రి పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశం
- సెప్టెంబర్‌లో ప్రారంభానికి ఏర్పాట్లు
- నాంపల్లి, మునుగోడు పీహెచ్‌సీల అప్‌గ్రేడ్ ప్రతిపాదనలపై సమీక్ష
- ఆరోగ్య మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

మునుగోడు నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువలో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం మునుగోడు నియోజకవర్గంలోని వైద్య మౌలిక వసతుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, చౌటుప్పల్‌లో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఏరియా ఆస్పత్రి పనులను మిగతా 2 లో..





## సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు టీ–ఫైబర్

- ప్రైవేటు ఇంటర్నెట్ సేవలకు బిల్లులు చెల్లించొద్దని మంత్రి ఆదేశం
- టీ–స్కాన్‌ను నెల రోజుల్లో టీ–ఫైబర్‌కు అనుసంధానం చేయాలని సూచన
- ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక డిజిటల్ మౌలిక వసతుల కల్పనపై దృష్టి

**హైదరాబాద్, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ–ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. తెలంగాణ సచివాలయంలో మంగళవారం టీ–ఫైబర్ పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన మిగతా 2 లో..

## బ్రహ్మోత్సవాలకు టీటీడీ కీలక నిర్ణయం

- తొమ్మిది రోజుల పాటు ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు
- సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం కల్పించనున్న టీటీడీ



2

## లోక్‌సభలో జిల్లా అభివృద్ధి ప్రస్తావన

- వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్రాన్ని నిలదీత
- పీఎం గతిశక్తి, ఆస్పిరేషనల్ బ్లాక్స్ పథకాలపై వివరాలు కోరిన ఎంపీ



2

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో వరంగల్ జిల్లా అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతికి సంబంధించిన అంశాలను ప్రస్తావించారు.

## కాళేశ్వరమే రాష్ట్రానికి ఆధారం!

**హైదరాబాద్, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్రంలో రానున్న నెలల్లో సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చాలంటే కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ఇటీవల అల్పపీడనాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసినా నీటి సమస్య పూర్తిగా తీరలేదని ఆయన పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, రానున్న ఎనిమిది నెలల పాటు సాగునీరు, తాగునీటి అవసరాలు నిరంతరంగా అందించాలంటే కాళేశ్వరం ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. రాష్ట్రంలోని జలవనరులను సమర్థంగా వినియోగించే దిశగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు కన్నెపల్లి ప్రాంతాన్ని సందర్శించకుండా ఎస్సారెస్పీ ప్రాంతానికి వెళ్లడాన్ని ఆయన విమర్శించారు. నీటి సమస్యల పరిష్కారంపై వాస్తవ పరిస్థితులను పరిశీలించి, అవసరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయంలో ప్రభుత్వం సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పెద్దమనసుతో వ్యవహరించి రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలని జీవన్‌రెడ్డి సూచించారు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియను ప్రారంభించి రైతులు, ప్రజలకు అవసరమైన నీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నీటి నిర్వహణలో ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలని సూచించారు.

## సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్

మొదటిపేజీ తరువాయి

సంజయ్ జాజు, సమాచార సాంకేతిక శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ–ఫైబర్ మేనేజింగ్ డైరెక్టర్ వేణు ప్రసాద్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను నిర్దేశిత గడువులోగా టీ–ఫైబర్ నెట్‌వర్క్‌కు అనుసంధానం చేయాలని మంత్రి సూచించారు. అందుకు అవసరమైన మౌలిక వసతుల పనులను వేగంగా పూర్తి చేసి, ఎలాంటి జాప్యం లేకుండా అన్ని కార్యాలయాల్లో టీ–ఫైబర్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 1 తర్వాత ప్రభుత్వ కార్యాలయాల కోసం ప్రైవేటు ఇంటర్నెట్ సేవలందించే సంస్థలకు ఎలాంటి బిల్లులు ప్రాసెస్ చేయకూడదని, చెల్లింపులు కూడా నిలిపివేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఆ తర్వాత ప్రభుత్వ కార్యాలయాలకు పూర్తిస్థాయిలో టీ–ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్త నెట్‌వర్క్ (టీ–స్వాన్)ను టీ–ఫైబర్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ శాఖలకు అంతరాయం లేకుండా నిరంతర ఇంటర్నెట్ సేవలు అందేలా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని, సాంకేతిక మార్పిడి సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ప్రతిష్ఠాత్మక ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు అత్యాధునిక డిజిటల్ మౌలిక వసతులు కల్పించే దిశగా అధిక వేగం కలిగిన టీ–ఫైబర్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రతి ఇంటికి ఇంటర్నెట్" కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అధిక వేగంతో కూడిన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించాలని సూచించారు. టీ–ఫైబర్ మౌలిక వసతుల బలోపేతం ద్వారా డిజిటల్ తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థలు, ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన, అందుబాటు ధరలో అధిక వేగం కలిగిన ఇంటర్నెట్ సేవలు అందించడం ద్వారా రాష్ట్రాన్ని డిజిటల్ రంగంలో మరింత ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

## రహ్మాత్ పాషాను అభినందించిన కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

ఆస్ట్రేలియాలోని బోండీ ప్రాంతంలో జరిగిన విషాద ఘటనలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి పలువురి ప్రాణాలను కాపాడిన హైదరాబాద్‌కు చెందిన భారతీయ మూలాల వ్యక్తి రహ్మాత్ పాషాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. దాదాపు 20 మంది ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషించిన రహ్మాత్ పాషాకు ఆస్ట్రేలియా ప్రభుత్వం శాశ్వత నివాస హోదా కల్పించడం ప్రతి భారతీయుడికి, ముఖ్యంగా తెలుగు సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. రహ్మాత్ పాషా ప్రదర్శించిన ధైర్యం, మానవత్వం అసాధారణమని కేటీఆర్ కొనియాడారు. బోండీ ఘటన సమయంలో ప్రాణాలకు తెగించి గాయపడిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం ద్వారా అనేక కుటుంబాల్లో విషాదాన్ని నివారించ గలిగారని అన్నారు. సమాజం కోసం నిస్వార్థంగా సేవ చేయాలనే భావనను ఆయన తన కార్యాచరణతో చాటిచెప్పారని ప్రశంసించారు. బోండీ బీచ్ సమీపంలో ఒక ప్రయాణికుడిని దింపిన అనంతరం పెద్ద శబ్దాలు వినిపించడంతో తొలుత వాటిని బాణాసంచా శబ్దాలుగా భావించిన రహ్మాత్ పాషా, పరిస్థితిని గమనించి వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగుడు దాడి చేస్తున్నట్లు గుర్తించిన ఆయన అక్కడి నుంచి వెళ్లిపోకుండా గాయపడిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొని అనేక మంది ప్రాణాలను రక్షించేందుకు విశేషంగా కృషి చేశారు. రహ్మాత్ పాషా చూపిన ధైర్యసాహసాలను గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆయనకు శాశ్వత నివాస హోదా మంజూరు చేయడంతో పాటు ప్రతిష్ఠాత్మక బ్రేవరీ అవార్డుకు కూడా నామినేట్ చేసినట్లు సమాచారం. ఆయన సేవలను తాను పనిచేసిన రైడ్ షేరింగ్ సంస్థ కూడా ప్రత్యేకంగా గుర్తించి అభినందించినట్లు వెల్లడైంది.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

**ములుగు, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి) :**

విద్యార్థులు ఇష్టంతో, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, పోటీ ప్రపంచంలో ప్రతిభ చాటాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. మంగళవారం వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలో సమగ్ర శిక్ష పథకం కింద రూ.2.30 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనం, అదనపు తరగతి గదులు, ప్రయోగశాల భవనాలను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి కంప్యూటర్ విద్యపై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు. గొప్ప విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని, విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, ధ్యానం కూడా జీవితంలో ముఖ్యమని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేటు విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు మంత్రి సూచించారు. ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. రానున్న పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలోనే ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# ఈ20 పెట్రోల్‌కు పంజాబ్ బ్రేక్

మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో ప్రజలకు ప్రత్యామ్నాయంగా సాధారణ పెట్రోల్‌ను కూడా విక్రయించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ20 పెట్రోల్ వల్ల మైలేజీ తగ్గుతుంటే దానికి అనుగుణంగా ఇంధన ధరను తగ్గించాలని కూడా తీర్మానంలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఆటోమొబైల్ ఇంజినీర్లు, పెట్రోలియం రంగ నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో కూడిన స్వతంత్ర నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి ఈ20 పెట్రోల్ ప్రభావంపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ అధ్యయనం నివేదిక ఆధారంగానే తదుపరి విధాన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సభలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మాట్లాడుతూ, సుమారు 45 వేల వాహనాలపై నిర్వహించిన అధ్యయనంలో ఈ20 పెట్రోల్ వినియోగం కారణంగా మైలేజీ తగ్గినట్లు, కొన్ని వాహనాల్లో సాంకేతిక సమస్యలు కూడా తలెత్తినట్లు గుర్తించారని తెలిపారు. వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని మరోసారి సమీక్షించాలని కోరారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఒకే విధమైన ఇంధన విధానాన్ని అమలు చేయడం సరికాదని అన్నారు.ఇటీవల అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం నేపథ్యంలోనే ఈ20 పెట్రోల్ వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని భగవంత్ మాన్ ఆరోపించారు. ఆ ఒప్పందంలో భాగంగా భారత్ భారీ మొత్తంలో ఇథనాల్ కొనుగోలు చేయాల్సి ఉంటుందని, అందుకే దేశంలో ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా స్పందించలేదు. మరోవైపు పర్యావరణ పరిరక్షణ, ముడి చమురు దిగుమతుల తగ్గింపు, ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ20 పెట్రోల్ విధానాన్ని అమలు చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పంజాబ్ అసెంబ్లీ ఆమోదించిన తీర్మానం దేశవ్యాప్తంగా ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానంపై కొత్త చర్చకు దారితీసే అవకాశముందని రాజకీయ, పారిశ్రామిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## వర్షా లతో నగరానికి భారీ ఊరట

మొదటిపేజీ తరువాయి

వర్షాలు కురవలేదని గణాంకాలు సూచిస్తున్నాయి. తిరుమలగిరిలో 45 శాతం, సైదాబాద్‌లో 35 శాతం, మారేడ్‌పల్లిలో 31 శాతం, అంబర్‌పేటలో 27 శాతం, నాంపల్లి, చార్మినార్ ప్రాంతాల్లో 26 శాతం చొప్పున వర్షపాత లోటు కొనసాగుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదుకావడానికి ఇంకా మరిన్ని వర్షాలు అవసరమని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు గోల్కొండలో సాధారణం కంటే 19 శాతం అధిక వర్షపాతం నమోదైంది. బహదూర్‌పురాలో 5 శాతం ఎక్కువ వర్షాలు కురవగా, షేక్‌పేట, అమీర్‌పేట, ముషీరాబాద్, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో వర్షపాతం సాధారణ స్థాయికి చేరువలో ఉందని టీజీడీపీఎస్ వెల్లడించింది. ఇటీవల కురిసిన వర్షాలు నగరంలోని జలాశయాలు, భూగర్భ జలాలపై సానుకూల ప్రభావం చూపుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రానున్న ఏడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో ఆగస్టు 10 వరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉండటంతో బహిరంగ ప్రదేశాల్లో అవసరం లేకుండా సంచరించవద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. రైతులు, ప్రయాణికులు తాజా వాతావరణ హెచ్చరికలను గమనించాలని సూచించింది. రానున్న రోజుల్లో వర్షాలు కొనసాగితే నగరంలో వర్షపాత లోటు మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పట్టే అవకాశముందని, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలకు అవసరమైన హెచ్చరికలు జారీ చేస్తామని ఐఎండీ వెల్లడించింది.

## తుంగతుర్తి కాంగ్రెస్‌పై జగ్గారెడ్డి నివేదిక

**హైదరాబాద్, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరుపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేసి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు అందజేశారు. మొత్తం ఏడు పేజీలతో రూపొందించిన ఈ నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించినట్లు తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై గత పది రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి వెల్లడించారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం వాస్తవ పరిస్థితులను నివేదికలో పొందుపరిచినట్లు చెప్పారు. నివేదిక రూపొందించే క్రమంలో వర్గ విభేదాలకు దారితీసిన కారణాలు, పార్టీ శ్రేణుల అభిప్రాయాలు, స్థానిక పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి అవసరమైన సూచనలు కూడా నివేదికలో పొందుపరిచినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఏ నియోజకవర్గంలోనైనా స్థానిక ఎమ్మెల్యేనే తొలి నాయకుడని, ఆ తర్వాతే ఎంపీ, మంత్రులకు ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి పాత్ర ఉంటుందని పేర్కొన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల జరిగిన పరిణామాలను కూడా నివేదికలో ప్రస్తావించినట్లు తెలిపారు. పార్టీలో సమన్వయం, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక నాయకులుగా ఉన్నారని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## మునుగోడుకు మెరుగైన వైద్య సేవలు

మొదటిపేజీ తరువాయి

ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ నెలలో ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సమీక్ష సమావేశంలో చౌటుప్పల్ ఏరియా ఆస్పత్రి నిర్మాణ పురోగతితో పాటు నియోజకవర్గంలోని ఇతర ఆరోగ్య ప్రాజెక్టులపై కూడా మంత్రి ఆరా తీశారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు త్వరగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. నాంపల్లి, మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మరింత ఉన్నత స్థాయికి అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనలను కూడా మంత్రి సమీక్షించారు. అదేవిధంగా చందూరులో 100 పడకల ఏరియా ఆస్పత్రి ఏర్పాటు, చౌటుప్పల్‌లో తల్లి–శిశు ఆరోగ్య కేంద్రం, ట్రామా కేర్ కేంద్రాన్ని ప్రారంభించేందుకు అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావాలంటే జిల్లా, నియోజకవర్గ స్థాయిలోనే ఆధునిక వైద్య సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. అత్యవసర వైద్య సేవలు, ప్రసూతి సేవలు, ప్రమాద బాధితులకు తక్షణ చికిత్స అందేలా మౌలిక వసతులను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఆస్పత్రుల అభివృద్ధి, వైద్య పరికరాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, ప్రజలకు వేగవంతమైన వైద్య సేవల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. చౌటుప్పల్ ఏరియా ఆస్పత్రి ప్రారంభం అనంతరం మునుగోడు నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని అధికారులు తెలిపారు. ప్రతిపాదిత ప్రాజెక్టులు పూర్తయితే ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, నాణ్యమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు టీటీడీ కీలక నిర్ణయం

**తిరుమల, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అన్ని రకాల ఆర్జిత సేవలతో పాటు ప్రత్యేక ప్రవేశ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. ఉత్సవాలకు భారీ సంఖ్యలో తరలివచ్చే సామాన్య భక్తులకు ఎక్కువ అవకాశాలు కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. టీటీడీ ప్రకటన ప్రకారం బ్రహ్మోత్సవాల సమయంలో అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ వంటి అన్ని ఆర్జిత సేవలను పూర్తిగా నిలిపివేయనున్నారు. అదే విధంగా వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ప్రవాస భారతీయులు, దాతలకు కల్పించే ప్రత్యేక ప్రవేశ దర్శనాలను కూడా ఈ కాలంలో రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి దర్శనానికి లక్షలాది మంది భక్తులు తిరుమలకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో సాధారణ భక్తులకు దర్శనం సులభతరం చేయడం, వేచి ఉండే సమయాన్ని తగ్గించడం లక్ష్యంగా టీటీడీ ఈ చర్యలు చేపట్టింది. ఉత్సవాల సమయంలో సాధారణ దర్శనానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల తొమ్మిది రోజుల పాటు శ్రీవారి వాహన సేవలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ పేర్కొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రత, క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, రవాణా వంటి అన్ని సౌకర్యాలను మరింత విస్తృతంగా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులు ఈ మార్పులను ముందుగానే గమనించి తమ దర్శన ప్రణాళికలను రూపొందించుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

## లోక్‌సభలో జిల్లా అభివృద్ధి ప్రస్తావన

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం గతిశక్తి, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్‌తో పాటు ఇతర కేంద్ర పథకాల కింద వరంగల్ జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక రూపొందించిందా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పీఎం గతిశక్తి పథకం కింద వరంగల్ జిల్లాలో ఏయే మౌలిక వసతుల ప్రాజెక్టులు ప్రతిపాదించబడ్డాయి, వాటిలో ఎన్ని ఆమోదం పొందాయి, ప్రస్తుతం వాటి అమలు ఏ దశలో ఉందో సభకు వివరించాలని ఎంపీ కోరారు. జిల్లాలో రవాణా, పారిశ్రామిక, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం తీసుకుంటున్న చర్యలపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద వరంగల్ జిల్లాలోని ఏ ప్రాంతాలు ఎంపికయ్యాయో, వాటి అభివృద్ధి కోసం ఎంత మేర నిధులు కేటాయించారో వెల్లడించాలని కడియం కావ్య కోరారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో కేంద్రం చేపడుతున్న కార్యక్రమాల వివరాలను కూడా తెలియజేయాలని ప్రశ్నించారు. వరంగల్ జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ఉంటే, దాని కింద ఇప్పటికే మంజూరైన ప్రాజెక్టులు, భవిష్యత్తులో అమలు చేయనున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సభలో వెల్లడించాలని ఎంపీ కోరారు. జిల్లాలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగేలా కేంద్రం మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సమగ్రాభివృద్ధికి కేంద్ర పథకాలను సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని కడియం కావ్య పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. వరంగల్ ప్రజల అభివృద్ధి ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని ఈ అంశాలను లోక్‌సభలో లేవనెత్తినట్లు ఎంపీ కడియం కావ్య తెలిపారు. జిల్లాకు మరిన్ని అభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్ర నిధులు తీసుకురావడానికి తన వంతు కృషిని కొనసాగిస్తానని పేర్కొన్నారు.

## ఎల్‌నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన

**అమరావతి, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న విపరీత వాతావరణ పరిస్థితులపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం పరిస్థితులు, వ్యవసాయ రంగంపై ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అక్టోబర్ నెల వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులను ముందుగానే అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏయే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయవచ్చో వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు వివరించాలని ఆదేశించారు. శాస్త్రీయ సూచనల ఆధారంగా పంటల ఎంపిక జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎండీఎస్ విధానంలో సాగు చేపట్టేలా రైతులను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళికలు రూపొందించాలని, వ్యవసాయ విస్తరణ సిబ్బంది రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. పంటల నష్టాన్ని తగ్గించే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

# గౌడ కులస్తుల సంఘం ఆధ్వర్యంలో బోనాలు

### గౌడ సంఘ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ గౌడ్.

**సదాశివపేట. ఆగస్టు 4. (నవజ్యోతిప్రతినిధి):**



సదాశివపేట పట్టణములో గౌడ కులస్తుల బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గౌడ సంఘం అధ్యక్షుల ఆధ్వర్యంలో గౌడ కులస్తుల అంతా కలిసి దుర్గా భవాని మాతకి బోనాలు ఊరేగింపుగా వెళ్లి సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొనడం జరిగింది. స్థానిక ఈశ్వర్ మందిరం నుండి గౌడ కుల సంఘం మహిళలు బోనాలతో సదాశివపేటలోని గాంధీ చౌక్ మీదుగా దుర్గ భవాని మాత మందిరం వరకు చేరుకొని అమ్మవారికి ముక్కులు చెల్లించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో చింతాగోపాల్, చింత సాయినాథ్, ఎర్ర నరసింహ గౌడ్, పెద్ద గౌడ్, సిహెచ్ శంకర్ గౌడ్, ఎర్ర నాగరాజ్ గౌడ్, కోవూరి మానయ్య గౌడ్, గడీల కృష్ణ గౌడ్, శంకర్పల్లి శ్రీనివాస్ గౌడ్ , కోవూరి సత్యనారాయణ గౌడ్, గౌడ కులస్తులందరూ పాల్గొనడం జరిగింది.

# మేడ్చల్ నియోజకవర్గ ఏ-బ్లాక్ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడిగా మహమ్మద్ రహ్మాత్ అలీ నియామకం

**మేడ్చల్, ఆగస్టు 4 ( నవజ్యోతి ప్రతినిధి ):**



మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో అత్వెల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ రహ్మాత్ అలీ ని ఏ-బ్లాక్ మైనార్టీ అధ్యక్షుడిగా మంగళవారం అధికారికంగా నియమించారు. ఈ మేరకు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్ ఎం.డి. ఖాజామొయినుద్దీన్ రహ్మాత్ అలీకి నియామక పత్రాన్ని అందజేశారు.

**టీపీసీసీ మైనార్టీ చైర్మన్:** మహమ్మద్ ఇర్ఫాన్ అలీ మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు & నియోజకవర్గ ఇన్‌చార్జి: తోటకూర వజ్రేష్ యాదవ్జి ల్లా మైనార్టీ విభాగం చైర్మన్: మీర్జా అజిజుల్లా బేగ్పా ర్టీ బలోపేతానికి కృషి చేస్తా రహ్మాత్ అలీ ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన రహ్మాత్ అలీ మాట్లాడుతూ.. తనకు మేడ్చల్ నియోజకవర్గ ఏ-బ్లాక్ మైనారిటీ అధ్యక్ష పదవిని బాధ్యతగా అప్పగించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ పెద్దలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పని చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ యూసుఫ్, జిల్లా మైనార్టీ వైస్ చైర్మన్ ఆయుబ్ ఖాన్, ఎండి ముక్తార్, సయ్యద్ అబెద్, అబ్దుల్ రెహమాన్, వసీం, నడికొప్పు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని డిమాండ్

- విద్యార్థుల ఆటో ప్రమాదం నేపథ్యంలో అధికారులకు బీజేపీ వినతి.
- బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు వై జంక్షన్‌ను మూసివేయాలి

**రామాయంపేట, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**



ఎన్‌హెచ్-44 పై రామాయంపేట సమీపంలోని వై జంక్షన్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు ఆ జంక్షన్‌ను పూర్తిగా మూసివేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల తహసీల్దార్ రజినీకుమారి కి వినతిపత్రం సమర్పించారు. ఆగస్టు 3న విద్యార్థులు, ఉపాధ్యాయులతో వెళ్తున్న ఆటో వై జంక్షన్ వద్ద ప్రమాదానికి గురై పలువురు గాయపడిన ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, గతంలో ప్రమాదాల నివారణ కోసం మూసివేసిన బైపాస్ జంక్షన్‌ను కొందరు అక్రమంగా తిరిగి తెరవడం వల్ల ప్రమాదాలు పెరిగాయని ఆరోపించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు వై జంక్షన్ వద్ద రాకపోకలను నిలిపివేసి,రామాయంపేట వైపు నుంచి వచ్చే వాహనాలను సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరారు.ఈ ఘటనను గౌరవ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని ఎంపీ ఆస్పత్రి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారని చెప్పారు. అలాగే ఎంపీ సహకారంతో వై జంక్షన్ వద్ద ఫ్లైఓవర్/బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఎన్‌హెచ్-44పై ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా నేషనల్ హైవే అథారిటీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, నిజాంపేట మాజీ జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కౌన్సిలర్ శంకర్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు, లక్ష్మాపూర్ సర్పంచ్ నవీన్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు వడ్ల శ్యామ్, అక్కన్నపేట సర్పంచ్ యాదగిరి, దంతపల్లి సర్పంచ్ బాలరాజు, సీనియర్ నాయకులు వెలుముల సిద్దరాములు, పబ్బ సత్యం, చింతల శేఖర్, భానుచందర్, నవత్ రాజేంద్రప్రసాద్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేదు.. రౌడీషీటర్లకు పోలీసుల హెచ్చరిక

### ప్రజల భద్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

**మిర్యాలగూడ, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి)**



ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్టాన్ని ఉల్లంఘించి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ ఇన్‌చార్జి డీఎస్పీ జి.రవి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మంగళవారం మిర్యాలగూడ సబ్‌డివిజన్ పరిధిలో రౌడీషీటర్లతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌర్జన్యాలు, అక్రమ వసూళ్లు, ప్రజలను బెదిరించడం వంటి చర్యలకు పాల్పడినట్లు రుజువైతే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. బెయిల్‌పై బయట ఉన్న నిందితులు తమ నివాసం మార్చినా లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లినా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని సూచించారు. బెయిల్‌పై ఉన్నవారు బాధితులను బెదిరించే ప్రయత్నం చేసినట్లయితే వారి బెయిల్‌ను రద్దు చేయించేందుకు కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ రూరల్ సీఐ పీ.ఎన్.డి.ప్రసాద్, వన్‌టౌన్ సీఐ నాగభూషణ్, టూ టౌన్ సీఐ సోమ నర్సయ్య, రూరల్ ఎస్.ఐ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్-44 ప్రమాద బాధిత విద్యార్థులను పరామర్శించిన

- ఆర్డీవో రమాదేవి
- సీహెచ్‌సీ,తహసీల్దార్ కార్యాలయంలో సేవలపై సమీక్ష.
- కుల ధ్రువీకరణ పత్రాల జారీలో నిబంధనలు తప్పనిసరి

**రామాయంపేట,ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**





రామాయంపేట మండలంలో మంగళవారం మెదక్ ఆర్డీవో రమాదేవి ఆకస్మికంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ), తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ముందుగా సీహెచ్‌సీని సందర్శించిన ఆమె, సోమవారం ఎన్‌హె చ్-44 పై జరిగిన లారీ-ఆటో ప్రమాదంలో గాయపడి చికిత్స పొందు తున్న పాఠశాల విద్యార్థులను పరామ ర్శించారు.వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని,ప్రతి విద్యా ర్థికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ వహిం చాలని వైద్యాధికారులకు ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలోని వివిధ వార్డులు, వైద్య సేవలు, విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా సేవలందిం చాలని సూచించారు. అనంతరం రామా యంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో రమాదేవి రెవెన్యూ అధికారులు, జీపీవోలతో సమీక్ష నిర్వహించారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సదాబినామా దరఖాస్తులు, నాన్-డీఎస్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ASD, DSE, నో మ్యాపింగ్ కేసుల పురోగతిని అధికారులతో సమీక్షించి, అన్ని ప్రక్రియలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, వేగం, ప్రజా ప్రయోజనం ప్రధానంగా ఉండాలని అధికారులకు సూచించారు.

## అల్లాపూర్ లో నిలిచిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి: బండి రమేష్



**కూకట్ పల్లి, ఆగస్టు 4, ( నవజ్యోతి ప్రతినిధి):**

అల్లాపూర్ డివిజన్ సఫ్దర్ నగర్ ఇ-బ్లాక్ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలని తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. సఫ్దర్ నగర్‌లో పర్యటించిన ఆయన అధ్వానంగా ఉన్న రోడ్లను పరిశీలించి అధికారులను ఫోన్ ద్వారా నిలదీశారు. నాలుగు నెలల క్రితం పాదయాత్రలో గుర్తించిన సమస్యలే ఇప్పటికీ కొనసాగడంపై ఆవేదన వ్యక్తం చేశారు.జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ శాఖల సమన్వయ లోపంతో పనులు నిలిచిపోవడం సరికాదన్నారు. మంజీరా పైప్‌లైన్ సాకుతో ఆలస్యం చేయకుండా నిధులు మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేసి వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులు తొలగించాలని సూచించారు. కాలనీ సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పర్యటనలో స్థానిక నాయకులు వాజీద్ పాషా, లక్ష్మణ్ గౌడ్, రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలి: వడ్డేపల్లి రాజేశ్వరరావు



**కూకట్ పల్లి, ఆగస్టు 4, ( నవజ్యోతి ప్రతినిధి):**

మాదకద్రవ్యాల రహిత భారత నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ సీనియర్ నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. వివేకానంద నగర్‌లోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో 'నశా ముక్త్ భారత్ అభియాన్', 'మిషన్ స్పందన్'లో భాగంగా '10 కోట్ల మాదకద్రవ్యాల రహిత ప్రతిజ్ఞ' మెగా క్యాంపెయిన్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వ్యసనాలకు దూరంగా ఉండే యువత దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని మోదీ ఇచ్చిన సందేశాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. బ్రహ్మకుమారీస్ సంస్థ ధ్యానం, విలువలతో కూడిన విద్య ద్వారా అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రముఖులు, యువత, స్థానికులు పాల్గొని డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు.

## రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు



**కూకట్ పల్లి, ఆగస్టు 4, ( నవజ్యోతి ప్రతినిధి):**

ఆలయాలు ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవకు కేంద్రాలుగా నిలుస్తాయని బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు తెలిపారు. కూకట్‌పల్లి సంగీత్ నగర్ రేణుక ఎల్లమ్మ దేవస్థానంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని వడ్డించారు. భక్తులకు సేవ చేయడం గొప్ప పుణ్యకార్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆటో డ్రైవర్స్ యూనియన్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## బస్వాపూర్ వాసి 59వ సారి రక్తదానం

### కిడ్నీ మార్పిడి పేషెంట్ కు అత్యవసర సమయంలో అండగా నిలిచిన శ్రీనివాస్...

**భిక్కనూరు, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**



కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన వి. రమేష్‌కు కిడ్నీ మార్పిడి చికిత్సలో భాగంగా అత్యవసరంగా రక్తం అవసరం ఏర్పడగా, అదే గ్రామానికి చెందిన కమ్మరి శ్రీనివాస్ స్పందించి హైదరాబాద్‌కు వెళ్లి రక్తదానం చేశారు. ఇది ఆయన 59వ రక్తదానం కావడం విశేషం. అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేసిన కమ్మరి శ్రీనివాస్ సేవలను జిల్లా రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్ అభినందించారు. అవసరంలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా ఒక ప్రాణానికి కొత్త ఆశను అందించవచ్చని పేర్కొంటూ, సమాజంలో మరింత మంది స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

## ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డిని కలిసిన పద్మశాలి కాలనీ నూతన కమిటీ



**ఏఎస్ రావు నగర్,ఆగస్టు 04,(నవజ్యోతి ప్రతినిధి) :**

ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని పద్మశాలి కాలనీ నూతన కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ పాండాల యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన దీప యెముల, ఉపాధ్యక్షుడు సదానందం,ప్రధాన కార్యదర్శి బోగా వెంకటేష్,కోశాధికారి జయకర్,సంయుక్త కార్యదర్శులు నర్సింహులు ఎల్.కే.,యాదగిరి గౌడ్, కార్యవర్గ సభ్యులు రామాదేవి ఎన్., సుభాష్ ఎం., విజయ్ కుమార్ జి.,సందీప్ జాదల తదితరులు పాల్గొన్నారు.కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణపై పరమేశ్వర్ రెడ్డితో చర్చించారు. నూతన కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు

- **భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు**
- **అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలు**
- **ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని అమ్మవారిని ప్రార్థించిన చైర్ పర్సన్**



**రామాయంపేట, ఆగస్టు 4 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**

రామాయంపేట పట్టణంలోని 3వ వార్డు రైతు బజార్ సమీపంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన పవిత్ర బోనాల మహో త్సవం, అమ్మవారి కళ్యాణ మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి గజవాడ లావణ్య నాగరాజు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని ప్రార్థించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుగులోతు రవి, దేవుని రంజిత్, శంకర్ గౌడ్, మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ చింతల యాదగిరి, మాజీ పట్టణ అధ్యక్షుడు దాకి స్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల స్వామి, మట్టి యాదగిరి, సుకుమార్, సుంకోజు దామోదర్, సుందర్ సింగ్, మొబిన్, మధునాల స్వామి గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు చిలుక విరాట్, భాను ప్రసాద్, దేవుని నరేష్, నరేందర్, సాయి తేజ, సుధీర్ గౌడ్, సోహెల్, గణేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా రీ-వెరిఫికేషన్ వేగవంతం చేయాలి.

### ఆగస్టు 10లోపు అర్హులైన ఓటర్ల వివరాలు నమోదు చేయాలి: తహసీల్దార్ మంగ



**నడిగూడెం ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి) :**

మండల పరిధిలోని 29 పోలింగ్ బూత్‌లలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఇప్పటికే 100 శాతం పూర్తయినప్పటికీ, మరింత ఖచ్చితత్వం కోసం మంగళవారం మరోసారి రీ–వెరిఫికేషన్ చేపట్టాలని తహసీల్దార్ మంగ బూత్ లెవెల్ ఆఫీసర్లకు (బీఎల్ఓలు) ఆదేశించారు.ఈ సందర్భంగా మండలంలోని కాగిత రామచంద్రపురం, బృందాపురం, వేణుగోపాలపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పేరు నమోదు కాని వారిని గుర్తించి, వారి వివరాలను ఆగస్టు 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సవరణ ప్రక్రియనుపూర్తి చేయాలని బీఎల్ఓలకు ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## దిల్ కుష్ నగర్ లో సైన్ బోర్డుల ప్రారంభం: నీటి సమస్యపై ఎమ్మెల్యే స్పందన

**కూకట్ పల్లి, ఆగస్టు 4, (నవజ్యోతి ప్రతినిధి):**

బాలానగర్ డివిజన్ దిల్‌కుష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేఔట్ సైన్ బోర్డులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ప్రారంభించారు. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులను ఈ సందర్భంగా అభినందించారు. మౌలిక వసతుల అభివృద్ధికై ప్రజల భాగస్వామ్యం అవసరమని స్పష్టం చేశారు. కాలనీలో మంచి నీటి ఒత్తిడి తక్కువగా ఉందన్న స్థానికుల ఫిర్యాదుపై స్పందించిన ఎమ్మెల్యే, సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత మందడి సుధాకర్ రెడ్డి, డివిజన్ కార్యదర్శి మొహమ్మద్ ఖాజా, అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ ముజీబ్, ప్రధాన కార్యదర్శి ఖాదర్ హుస్సేన్, సభ్యులు జమీల్, కరీముల్లా, ఫారూఖ్, ఆంజనేయులు గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన శిశువు ఎదుగుదలకు తల్లిపాలే అమృతం

**మిర్యాలగూడ, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి)**




మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ పి.వేణుగోపాలరావు ఆదేశాల మేరకు, ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం గాంధీనగర్ సెక్టార్ పరిధిలోని పాపపూసల దిబ్బ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు తల్లిపాల విశిష్టత, శిశువుల ఆరోగ్యానికి వాటి ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. బిడ్డ జన్మించిన గంటలోపు వచ్చే ముర్రిపాలు (కొలస్ట్రం) శిశువుకు మొదటి టీకా వంటివని, వాటిలో ఉండే పోషకాలు, రోగనిరోధక శక్తిని పెంచే అంశాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వివరించారు. ప్రతి తల్లి తప్పనిసరిగా ముర్రిపాలను బిడ్డకు ఇవ్వాలని సూచించారు. పుట్టిన రోజు నుంచి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు సహా ఎలాంటి ఇతర ఆహారం లేదా ద్రవాలు ఇవ్వకూడదని తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు అవి అత్యంత అవసరమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు సామూహిక అన్నప్రాసన వేడుకలను నిర్వహించి, తల్లిదండ్రులకు శిశు పోషణపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నజీమాబేగం మహమ్మద్, బ్లాక్

# దంతేపల్లి,పర్వతాపూర్ గ్రామాల్లో బాలల గ్రామసభలు నిర్వహణ.

- **బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి: సర్పంచ్‌లు**
- **నాయకత్వ లక్షణాల పెంపునకు బాల గ్రామసభలు దోహదం**
- **విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.**

**రామాయంపేట,ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**



తెలంగాణ ప్రభుత్వం 2026–27 కార్యాచరణలో భాగంగా రామాయంపేట మండలంలోని దంతేపల్లి, పర్వతాపూర్ గ్రామాల్లో మంగళవారం బాల గ్రామసభలు నిర్వహించారు. దంతేపల్లి గ్రామంలో సర్పంచ్ మాస్కూరి బాలరాజు, పర్వతాపూర్ గ్రామంలో సర్పంచ్ తార్య నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాల్లో బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యం కల్పిస్తూ గ్రామాభివృద్ధి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ప్రణాళికల్లో బాలల సూచనలు కూడా కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలు, పోషకాహారం అందేలా చర్యలు తీసు కుంటామని తెలిపారు. విద్యార్థులు తమ పాఠశాలలు, గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలను సభలో స్వేచ్ఛగా వివరించగా, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల ద్వారా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అధికారులు విద్యార్థులకు విద్య, ఆరోగ్యం, పోషకాహారం, బాలల హక్కులు, బాలల భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. బాల గ్రామసభలు చిన్నారుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రామాయంపేట లో రహదారి ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి: బీజేపీ నేతలు

- **వై జంక్షన్‌ను మూసివేసి భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్.**
- **విద్యార్థుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి.**
- **ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎన్‌హెచ్‌ఏఐ, జీఎంఆర్ అధికారులు**

**రామాయంపేట,ఆగస్టు4 ( నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్ ) :**



రామాయంపేట పట్టణ కేంద్రంలో ఇటీవల మోడల్ స్కూల్ విద్యార్థులతో వెళ్తున్న ఆటో రోడ్డు ప్రమాదానికి గురికావడం అత్యంత బాధాకరమని భారతీయ జనతా పార్టీ పేర్కొంది.ఈ ఘటన విద్యార్థుల తల్లిదండ్రు లతో పాటు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందని ఆ పార్టీ నాయకులు తెలిపారు.రామాయంపేట బైపాస్ లోని ప్రమాదకరమైన వై జంక్షన్ వద్ద గతంలో కూడా సుమారు 30 మంది ప్రాణాలు కోల్పోయినప్పటికీ, ఇప్పటికీ శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వరుస ప్రమాదాలను నివారించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వెంటనే ప్రమాద కరమైన వై జంక్షన్‌ను మూసివేసి, శాశ్వత భద్రతా చర్యలు చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేసింది.ఇటీవల జరిగిన విద్యార్థుల రోడ్డు ప్రమాదంపై మెదక్ పార్లమెంట్ సభ్యుడు ఎం. రఘునందన్ రావు ప్రత్యేక చొరవ తీసుకుని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదే శించినట్లు తెలిపారు.దీంతో ఎన్‌హెచ్–44 మేనేజర్ రంగారావు, జీఎంఆర్ మేనేజర్ రాజేం దర్, స్థానిక సీఐ బాదావత్ సైదానాయక్‌తో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించి, శాశ్వత ప్రమాద నివారణ చర్యలపై చర్చించారు. అవసరమైన పనులు పూర్తి చేయడానికి సుమారు 15 రోజుల సమయం అవసరమని అధికారులు వెల్లడిం చినట్లు పేర్కొన్నారు .ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా ఎంపీ రఘునందన్ రావు తీసుకున్న చొరవను స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు అభినందించారు. ప్రభుత్వ,మోడల్ స్కూల్ విద్యార్థుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల ప్రారంభం,ముగింపు సమయాల్లో ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి, విద్యార్థులు ఆటోల్లో ప్రమాద కరంగా ప్రయాణించాల్సిన పరిస్థితిని నివా రించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ కోరింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నమైన శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు తీగల శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు మస్కూరి బాలరాజు, బక్కయ్యగారి యాదగిరి, కౌన్సిలర్ శంకర్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్ వ్యాఖ్యలు మర్చిపోయావా కేటీఆర్

**మేడ్చల్, ఆగష్టు 04(నవజ్యోతి ప్రతినిధి )**



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ లబ్ధి కోసం కేటీఆర్ మాట్లాడటం సరికాదని మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మండిపడ్డారు. గతంలో కేసీఆర్ నిండు సభలో ఇంజనీరింగ్ విద్యార్థులను, వ్యవస్థను అవహేళన చేసింది మర్చిపోయావా అని ప్రశ్నించారు. 370 ఇంజనీరింగ్ కాలేజీలు అవసరమా అన్నది కేసీఆర్ కాదా? అని నిలదీశారు. యువతను, విద్యార్థులను మోసం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇప్పటికే దాదాపు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు, స్కిల్ దెవలప్ మెంట్ ద్వారా ఉపాధి కల్పిస్తున్న ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రెస్ మీట్లు, సభల పేరుతో యువతను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని, లేదంటే ప్రజలు మరోసారి తగిన గుణపాఠం చెబుతారమని హెచ్చరించారు.

# అత్యవసర వైద్య సేవలపై సీహెచ్‌సీలో సమన్వయ సమావేశం

- **రోగులకు సత్వర, సురక్షిత చికిత్సే లక్ష్యం.**
- **అత్యవసర కేసుల నిర్వహణపై పోలీసు–108–వైద్య సిబ్బంది సమీక్ష.**

**రామాయంపేట,ఆగస్టు 4(నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్) :**



రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో మంగళవారం అత్యవసర వైద్య సేవల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు.అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సత్వర,సురక్షిత, నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రాణాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అత్యవసర కేసులు ఆస్పత్రికి చేరిన వెంటనే చికిత్స ప్రారంభించడం, పోలీసు శాఖ, 108 అంబులెన్స్ సిబ్బంది, వైద్య సిబ్బంది మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, రోగులను అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు వేగంగా తరలించే విధానాలపై సూచనలు చేశారు. ప్రతి అత్యవసర కేసులో సమయపాలన, సమన్వయం, నాణ్యమైన వైద్య సేవలే రోగుల ప్రాణాలను కాపాడటంలో కీలకమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో రామాయంపేట ఎస్ఐ బాలరాజు,మెదక్ జిల్లా 108 ఇన్‌చార్జి, రామాయంపేట సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీవ్ గృహకల్ప వాసుల సమస్యలపై వినోద్ కుమార్ ఫోకస్

- నివాసితుల వినతికి వెంటనే స్పందన..శాశ్వత పరిష్కారానికి హామీ
- ప్రజల మధ్యకు..సమస్యల పరిష్కారానికి ముందుకు

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 4: (నవజ్యోతి ప్రతినిధి)**



292వ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప 131, 132, 133, 134 బ్లాకుల్లో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యలను స్థానిక నివాసితులు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వారాల వినోద్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సరఫరాలో అంతరాయాలు, సీసీ రోడ్ల సమస్య, శానిటేషన్ లోపాలు, భద్రతా సమస్యలు తదితర అంశాలను నివాసితులు వివరించగా, వారాల వినోద్ కుమార్ వెంటనే స్పందించారు. సమస్యలను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద గౌడ్‌తో పాటు సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, ప్రతి సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని దశలవారీగా పరిష్కరించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప బ్లాకుల నివాసితులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ సమస్యల పరిష్కారంపై ఆశాభావం వ్యక్తం చేశారు.

# భూ హద్దుల నిర్ధారణ ఖచ్చితంగా జరగాలి



- పట్టా భూముల డీమార్కేషన్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో రమణారెడ్డి

**వేములపల్లి, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి)**

మండలంలోని తిమ్మారెడ్డి గూడెం గ్రామంలో పునఃసర్వేలో భాగంగా మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి పట్టా భూముల హద్దుల నిర్ధారణ (డీమార్కేషన్) ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. సర్వే పనులు ఖచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించి భూ యజమానులకు స్పష్టమైన హద్దులు చూపాలని అధికారులను ఆదేశించారు. భూ యజమానుల సమక్షంలో రికార్డులకు అనుగుణంగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమలత, జీపీఓ తేజ, సర్వేయర్ కళ్యాణి, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సీఎం కార్యాలయానికి బీసీ యువజన సంఘం ఉత్తరాల పంపిణీ

- మూడేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్

**మిర్యాలగూడ, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయానికి మంగళవారం ఉత్తరాలను పంపించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడం రోజురోజుకూ భారంగా మారుతోందన్నారు. మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల కోసం వేధిస్తున్నాయని, దీంతో పలువురు విద్యార్థులు చదువులు మధ్యలోనే మానివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఫీజు బకాయిల కారణంగా కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ బాధ్యతలను స్వయంగా ముఖ్యమంత్రి నిర్వహిస్తున్నప్పటికీ విద్యార్థుల సమస్యలపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ సిద్ధం రాజు, నియోజకవర్గ నాయకులు మునగాల శైలేందర్, బీసీ జేఏసీ పట్టణ నాయకులు దాసరాజు జయరాజ్, సైదా నాయక్, రవీందర్ నాయక్, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# హుండీ పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లిన దొంగలు.....

- తూప్రాన్ పరిధిలో వరుస చోరీలతో రెచ్చిపోతున్న దొంగలు...

**తూప్రాన్, 04 ఆగష్టు (నవజ్యోతి ప్రతినిధి నవీన్**



తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పోతారాజ్ పల్లి సమీపంలోని హనుమాన్ వెంచర్ లో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయంలో చోరి కేసు వెలుగులోకి గత నెల 28 తేదీన ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు సమావేశం అనంతరం దేవాలయానికి తాళం వేసి వెళ్లారు ఆదివారం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళం పగలగొట్టి హుండీ నీ పగల గొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెనట్లు ఆలయ కమిటీ సభ్యుడు గొలుసుల నర్సిములు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేపట్టినట్టు తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు, స్థానికులు తరచూ జరుగుతున్న దొంగతనాలపై పోలీసులు గట్టి చర్యలు చేపట్టి రాత్రి వేళల్లో కాలనీలలో పెట్రోలింగ్ పోలీసులు తిరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ముమ్మిడివరంలో అక్రమ ఇసుక ఫిల్లింగ్‌కు అధికారుల అండ?

- తహసీల్దార్ కార్యాలయాన్ని గుప్పెట్లో పెట్టుకుని మట్టి, ఇసుక మాఫియా కొనసాగుతోందని స్థానికుల ఆరోపణ..

**ముమ్మిడివరం, ఆగస్టు 4 (నవ జ్యోతి ప్రతినిధి):**





ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో స్పెషల్ ఆఫీసర్ పాలన కొనసాగుతున్న సమయంలో, ముమ్మిడివరం హైవే రోడ్డును ఆనుకుని ఉన్న ఓ వెంచర్స్ లో అక్రమంగా ఇసుకతో భూమి ఫిల్లింగ్ జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ ఫిల్లింగ్‌పై ముమ్మిడివరం తహసీల్దార్ (MRO) స్పందించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. నగర పంచాయతీ పరిధికి సంబంధం లేని ఒక (VRO) రెవెన్యూ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ, తహసీల్దార్ కార్యాలయాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని మట్టి, ఇసుక మాఫియాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నప్పటికీ, సంబంధిత రెవెన్యూ ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎలాంటి విచారణ చేపట్టకపోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా స్పెషల్ అధికారి జోక్యం చేసుకుని అక్రమ ఇసుక ఫిల్లింగ్‌పై సమగ్ర విచారణ నిర్వహించి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్

- గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచన...

**కామారెడ్డి, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

పట్టణంలోని 38వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పుట్టిన శిశువులకు తల్లిపాలే అత్యుత్తమ ఆహారమని తెలిపారు. ఆరు నెలలు పూర్తయిన తర్వాత ప్రభుత్వం అందించే బాలామృతాన్ని తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. బాలామృతంలో పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, దీనిపై నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సాబెదా బేగం, సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**కలెక్టర్ బి.చంద్రశేఖర్**

**నల్గొండ, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి)**

మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం నల్గొండలోని ఎన్.జీ ప్రభుత్వ కళాశాలలో సంక్షేమ శాఖ, పోలీసు శాఖ, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "10 కోట్ల మాదక ద్రవ్య రహిత ప్రతిజ్ఞ" మెగా ప్రచార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ వ్యసనాలు, మద్యం, సిగరెట్లు, మాదక ద్రవ్యాల వినియోగం యువతలో ఆందోళనకరంగా పెరుగుతోందన్నారు. ఒకప్పుడు కొద్దిమందికే పరిమితమైన డ్రగ్స్ ఇప్పుడు అందుబాటులోకి రావడం ప్రమాదకర పరిణామమని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజం తీవ్రంగా నష్టపోతాయని హెచ్చరించారు. యువత నిగ్రహంతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాలపై సమాచారం తెలిసినా, ఎవరైనా బలవంతం చేసినా వెంటనే 1908 టోల్‌ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే 97 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలంటే డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని, జెన్‌జీ తరం డ్రగ్స్ రహిత తరంగా నిలవాలని ఆకాంక్షించారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించినట్లు గుర్తు చేశారు.




# భార్య కౌన్సిలర్... భర్త పెత్తనం?

- సోమారం 9వ వార్డు కార్యాలయంలో రాజేందర్ నాయక్ వ్యవహారంపై తీవ్ర విమర్శలు

**మేడ్చల్, ఆగస్టు 04(నవజ్యోతి ప్రతినిధి ) :**





ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని సోమారం 9వ వార్డు కార్యాలయంలో కౌన్సిలర్ అధికారాల వినియోగంపై వివాదం చెలరేగింది. వార్డు ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధి హోదాను పక్కనపెట్టి, భర్త జోక్యం చేసుకుంటున్న వైనం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వార్డు కౌన్సిలర్ మాలోత్ రజిత భర్త రాజేందర్ నాయక్‌కు ఎలాంటి అధికారిక పదవి లేకపోయినా, ఆగస్టు 3న వార్డు కార్యాలయంలోని అధికారిక కౌన్సిలర్ ఛాంబర్‌లోకి ప్రవేశించి నేరుగా కౌన్సిలర్ సీటులో కూర్చున్నారు. అంతేకాకుండా, అధికారులతో సమీక్షలు జరుపుతూ అధికారిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని వార్డు ప్రజలు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులు మాత్రమే తమ అధికారాలను వినియోగించాలని, ఏలాంటి పదవిలోనూ లేని వ్యక్తి నిర్ణయాలు తీసుకోవడం, కౌన్సిలర్ సీటులో కూర్చోవడం నిబంధనలకు విరుద్ధమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి అనధికారిక జోక్యం వ్యవస్థను అపహాస్యం చేసేలా ఉందని, ప్రజలను తప్పుదారి పట్టించే పరిస్థితులకు దారితీస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

### కలెక్టర్ స్పందించాలని విజ్ఞప్తి

ప్రజాప్రతినిధుల ముసుగులో తెరవెనుక సాగుతున్న ఈ అనధికారిక పెత్తనంపై జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, నిబంధనలను ఉల్లంఘించి పరిధికి మించి వ్యవహరించిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# రేపటి నుంచి ఎరువుల విక్రయాలకు కొత్త విధానం..

**ఎఫ్ ఎఫ్ ఎస్ అమలు**

**సంగారెడ్డి, ఆగస్టు 5 (నవజ్యోతి ప్రతినిధి):**

రాష్ట్రంలో ఎరువుల విక్రయాలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఎఫ్ ఎఫ్ ఎస్ విధానాన్ని ఆగస్టు 6 నుంచి అమల్లోకి తీసుకురానుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల విక్రేతలకు సూచనలు జారీ చేశారు. కొత్త విధానంలో రైతులు తమ మొబైల్ నంబర్ ఆధారంగా నమోదు చేసుకుని ఎరువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రతి రైతుకు ప్రత్యేక QR కోడ్ రూపొందించబడుతుంది. ఎరువుల విక్రేతలు POS యంత్రం ద్వారా QR కోడ్‌ను స్కాన్ చేసి విక్రయాలను నమోదు చేయనున్నారు. దీంతో రైతులు కొనుగోలు చేసిన ఎరువుల వివరాలు డిజిటల్ రూపంలో నమోదు అవుతాయి. ఆగస్టు 5 సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే పాత విధానంలో ఎరువుల విక్రయాలు కొనసాగుతాయని, అనంతరం పూర్తిగా FFS విధానంలోనే విక్రయాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా తమ మొబైల్ నంబర్‌ను ఎరువుల విక్రేతల వద్ద నమోదు చేసుకోవాలని, అవసరమైన వివరాలు ముందుగానే ధృవీకరించుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది.

## పాఠశాల ఆవరణలో నిల్వ నీటిని తొలగించిన మున్సిపల్ చైర్ పర్సన్



**కామారెడ్డి, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నిల్వ నీరు చేరి విద్యార్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ వెంటనే స్పందించి మున్సిపల్ జేసీబీ సహాయంతో నిల్వ నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు తొలగడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తూ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కళ్లెం సావిత్రి సత్యం, తాటి లావణ్య ప్రసాద్, వాజీద్, సిద్ధిఖ్, మున్సిపల్ డీఈ హన్మంతరావు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జంగంపల్లి గ్రామ సమస్యలను షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లిన కాంగ్రెస్ నాయకులు

### సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి త్వరిత పరిష్కారానికి ఆదేశం..



**భిక్కనూరు, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను విన్న షబ్బీర్ అలీ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి జంగంపల్లి గ్రామ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రకాష్, వార్డు సభ్యుడు రవి, సిద్ధారములు, మాజీ సర్పంచ్ నర్సింలు, టెంపుల్ డైరెక్టర్ కార్తీక్, ఆనంద్, బాలనర్సవ్వ, రామస్వామి, ఫయాజుద్దీన్, రమేష్ గౌడ్, దుర్గయ్య, అర్చన, లింగం బాలయ్య, రాజు, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ హితానికి ఉపయోగపడే పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి...

### డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సాత్విక రెడ్డి.



**ఉమ్మడి రంగారెడ్డి/ మొయినాబాద్, ఆగస్టు04,(నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**

మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ, బయోటెక్నాలజీ విభాగానికి చెందిన మిస్. కొండ లక్ష్మి జాహ్నవి పిహెచ్‌డీ (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) డిగ్రీని సాధించారు." ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ప్లాంట్ గ్రోత్ ప్రమోషన్ అండ్ బయోకంట్రోల్ పోటెన్సియల్ అఫ్ బాక్టీరియా ఐసోలేటెడ్ ఫ్రామ్ రైజోస్ఫియర్ సాయిల్ అండ్ థేయిర్ ఇంపాక్ట్ ఆన్ రూట్ క్రాప్స్ " అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు గాను ఈ డిగ్రీ లభించింది. ఈ పరిశోధన డాక్టర్ వి. శ్రీలేఖ పర్యవేక్షణలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సాత్విక రెడ్డి డిగ్రీని అధికారికంగా ప్రధానం చేశారు. ఆమె మాట్లాడుతూ జీవ సాంకేతిక శాస్త్రం జరుగుతున్న పరిశోధనలు దేశాభివృద్ధికి కీలకంగా మారుతున్నాయని, రైజోస్ఫియర్ నేల నుండి వేరుచేయబడిన బ్యాక్టీరియా యొక్క మొక్కల పెరుగుదల ప్రోత్సాహం, జీవ నియంత్రణ సామర్థ్యంపై పరిశోధన, దుంప పంటలపై వాటి ప్రభావం గురుంచి వాస్తవ ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం. రవీందర్, డీన్ రీసెర్చ్ & డెవలప్‌మెంట్ ఆచార్య క్రిస్టోఫర్, డీన్ అడ్మినిస్ట్రేషన్ ఆచార్య ఏ. రాజు, పరీక్షల కంట్రోలర్ ఆచార్య బి. రాజేందర్ రెడ్డి, డిప్యూటీ కంట్రోలర్ ఆచార్య ఈ . జగదీశ్ కుమార్, ఆచార్య టి. మురళి కృష్ణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ & పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మిడివరం ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో అనధికార నిర్మాణాలు..?

- **పాత పెట్రోల్ బంక్ వద్ద యథేచ్ఛగా లేఅవుట్లు, రేకుషెడ్లు – టౌన్ ప్లానింగ్ సిబ్బంది, కమిషనర్ పై స్థానికుల ఆరోపణలు...**

**ఆగస్టు 4, ముమ్మిడివరం (నవజ్యోతి ప్రతినిధి) :**

ముమ్మిడివరం ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతంలోని పాత పెట్రోల్ బంక్ సమీపంలో అనధికార లేఅవుట్లు, రేకుషెడ్ల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది, నగర పంచాయతీ కమిషనర్ చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు.ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, కమిషనర్‌కు ఆర్థిక ప్రయోజనం (చేతివాటా) ఉందని కొందరు స్థానికులు ఆరోపిస్తూ, ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## నిండుకుండలా మారిన పెద్ద చెరువును సందర్శించిన ఇప్ప శ్రీనివాస్

- **గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన...**



**కామారెడ్డి, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి):**

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కామారెడ్డి పట్టణంలోని చారిత్రాత్మక పెద్ద చెరువు పూర్ణస్థాయి నీటిమట్టానికి చేరుకుని అలుగు పారుతుండటంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇప్ప శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా చెరువు కట్టపై గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పూలు చల్లి జలహారతి ఇచ్చారు. అనంతరం చెరువు పరిసర ప్రాంతాలు, నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్ప శ్రీనివాస్ మాట్లాడుతూ, కామారెడ్డి ప్రాంతానికి జీవనాడిగా ఉన్న పెద్ద చెరువు నిండుకుండలా మారడం ఆనందదాయకమని అన్నారు. చెరువు నిండటంతో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తీరడంతో పాటు, పరిసర ప్రాంత రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. సమృద్ధిగా కురిసే వర్షాలు, నిండిన చెరువులు వ్యవసాయాభివృద్ధికి, భూగర్భ జలాల పెరుగుదలకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. చెరువును సందర్శించేందుకు వచ్చే ప్రజలు అలుగు పారే ప్రాంతాలు, నీటి ప్రవాహం వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, చిన్నపిల్లలను నీటి వద్దకు వెళ్లనీయకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంజాద్, రామ్మోహన్, గోనే శ్రీనివాస్, మాజీద్, బబులు, సాయిలు, లడ్డు, జావీద్ తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జెన్ జీ... ప్రపంచాన్ని రీడిఫైన్ చేస్తున్న తరం

## డిజిటల్ యుగంలో పుట్టిన కొత్త ఆలోచనా విధానం



**కామారెడ్డి, ఆగస్టు 4 ( నవజ్యోతి ఎడిటోరియల్)**

ప్రతి యుగాన్ని ఒక తరం నిర్వచిస్తుంది. కొన్ని తరాలు చరిత్రను అనుసరిస్తాయి. మరికొన్ని తరాలు చరిత్ర దిశనే మార్చేస్తాయి. ప్రస్తుతం ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, సాంకేతిక రంగం, విద్య, మీడియా, సామాజిక విలువలను ఒకేసారి ప్రభావితం చేస్తున్న తరం జెన్ జీ (Generation Z). 1997 నుంచి 2012 మధ్య జన్మించిన వారిని సాధారణంగా జెన్ జీగా పరిగణిస్తారు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా, కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికతల మధ్య పెరిగిన తొలి తరం ఇదే. అందుకే వీరిని "డిజిటల్ నేటివ్స్" అని పిలుస్తారు. అయితే జెన్ జీని కేవలం డిజిటల్ తరం అనడం సరిపోదు. ఇది ప్రపంచాన్ని కొత్త కోణంలో అర్థం చేసుకోవాలని, ప్రతి వ్యవస్థను ప్రశ్నించాలని భావిస్తున్న తరం. మునుపటి తరాలు సమాచారం కోసం వేచి చూసేవి. జెన్ జీ మాత్రం సమాచారాన్ని వెతుకుతుంది, విశ్లేషిస్తుంది, ఇతరులతో పంచుకుంటుంది. ఒకప్పుడు వార్తలు ప్రభుత్వాల నుంచి ప్రజలకు చేరేవి. ఇప్పుడు ప్రజల స్పందన కూడా ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంది. ఇదే జెన్ జీ తీసుకొచ్చిన అతిపెద్ద మార్పు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు మాత్రమే కాదని, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యమని ఈ తరం గట్టిగా నమ్ముతోంది.

### వీధుల్లోకి వచ్చిన డిజిటల్ చైతన్యం

ప్రపంచవ్యాప్తంగా ఇటీవల జరిగిన అనేక ఉద్యమాల్లో జెన్ జీ ప్రభావం స్పష్టంగా కనిపించింది. నేపాల్‌లో అవినీతి, నిరుద్యోగం, పాలనా వైఫల్యాలు, సోషల్ మీడియాపై నియంత్రణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా యువత పెద్ద ఎత్తున వీధుల్లోకి రావడం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఈ ఉద్యమం కేవలం రాజకీయ నిరసనగా కాకుండా, మెరుగైన పాలన కోసం యువత వ్యక్తం చేసిన సామాజిక ఆకాంక్షగా అనేక పరిశోధకులు విశ్లేషించారు. అయితే కొన్ని చోట్ల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు ఉద్యమ లక్ష్యాన్ని కొంతవరకు దెబ్బతీశాయనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. ప్రజాస్వామ్యంలో ఉద్యమాలకు ఎంత ప్రాధాన్యం ఉందో, అవి శాంతియుతంగా సాగడానికీ అంతే ప్రాధాన్యం ఉందని ఈ పరిణామం గుర్తు చేసింది. నేపాల్ మాత్రమే కాదు. బంగ్లాదేశ్‌లో విద్యార్థి ఉద్యమాలు, కెన్యాలో పన్నుల వ్యతిరేక నిరసనలు, ఇండోనేషియా, సెర్బియా, పెరూ, ఫిలిప్పీన్స్ తదితర దేశాల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఆర్థిక సమానత్వం, ప్రభుత్వ జవాబుదారీతనం కోసం జరిగిన ఉద్యమాల్లో కూడా జెన్ జీ కీలక పాత్ర పోషించింది. దేశాలు మారినా, రాజకీయ పరిస్థితులు వేరైనా, యువత అడుగుతున్న ప్రశ్న మాత్రం ఒకటే—"మా భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాల్లో మా స్వరం ఎందుకు ఉండకూడదు?"

### భారత్‌లో పెరుగుతున్న కొత్త రాజకీయ చైతన్యం

భారత్‌లో కూడా జెన్ జీ ప్రభావం క్రమంగా పెరుగుతోంది. పరీక్షల పేపర్ లీకులు, నిరుద్యోగం, నియామకాల్లో జాప్యం, పర్యావరణ పరిరక్షణ, మహిళల భద్రత, ప్రజా విధానాల్లో పారదర్శకత వంటి అంశాలపై యువత సోషల్ మీడియా వేదికగా స్పందిస్తోంది. సమాచారం క్షణాల్లో అందుబాటులోకి రావడంతో ప్రభుత్వాలు కూడా ప్రజల అభిప్రాయాలను విస్మరించలేని పరిస్థితి ఏర్పడుతోంది. డిజిటల్ వేదికలు ప్రజల గొంతుకగా మారుతున్నాయి. అయితే అదే సమయంలో తప్పుడు సమాచారం, అపోహలు, ప్రచార యుద్ధాలు కూడా వేగంగా వ్యాపిస్తున్నాయి. అందుకే సమాచార స్వేచ్ఛతో పాటు సమాచార బాధ్యత కూడా అంతే అవసరం.

### ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ విపణిపై జెన్ జీ ముద్ర

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కూడా జెన్ జీ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉద్యోగం కోసం మాత్రమే ఎదురు చూడకుండా కొత్త అవకాశాలను సృష్టించుకోవాలనే ఆలోచన ఈ తరంలో ఎక్కువగా కనిపిస్తోంది. సాంకేతికత, స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు, సృజనాత్మక రంగాలు, స్వయం ఉపాధి వంటి అవకాశాల వైపు యువత ఆసక్తి చూపుతోంది. ఉద్యోగ విపణి కూడా ఈ తరం అభిరుచులకు అనుగుణంగా మారుతోంది. కేవలం డిగ్రీ కంటే నైపుణ్యాలకు, సృజనాత్మకతకు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యానికి ఎక్కువ విలువ పెరుగుతోంది.

### మీడియాను మార్చిన డిజిటల్ తరం

మీడియా ప్రపంచంలో కూడా జెన్ జీ ప్రభావం విశేషం. ఒకప్పుడు వార్తలను ప్రజలు స్వీకరించేవారు. ఇప్పుడు వాటిని ప్రశ్నిస్తున్నారు, విశ్లేషిస్తున్నారు, తమ అభిప్రాయాలను ప్రపంచంతో పంచుకుంటున్నారు. ఈ మార్పు సంప్రదాయ మీడియాకు కొత్త సవాళ్లను విసిరింది. అదే సమయంలో ఫేక్ న్యూస్, డీప్‌ఫేక్‌లు, తప్పుడు ప్రచారం, ఆల్గోరిథమ్ ఆధారిత సమాచార ప్రవాహం వంటి ప్రమాదాలు కూడా పెరిగాయి. అందుకే డిజిటల్ లిటరసీతో పాటు మీడియా లిటరసీ కూడా ఈ కాలంలో అత్యవసర నైపుణ్యంగా మారింది.

**-- సాయి మణికంఠ**
**మేనేజింగ్ ఎడిటర్**

### బలాలు... బలహీనతలు రెండూ ఉన్నాయి

జెన్ జీని ప్రత్యేకంగా నిలబెట్టేది వారి సాంకేతిక నైపుణ్యం మాత్రమే కాదు. ప్రపంచ సమస్యలపై స్పందించే చైతన్యం, పర్యావరణ పరిరక్షణపై బాధ్యత, సమానత్వంపై అవగాహన, కొత్త ఆలోచనలను స్వీకరించే ధైర్యం, సంప్రదాయాలను ప్రశ్నించే స్వభావం ఈ తరానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ఇదే సమయంలో ఈ తరంపై విమర్శలు కూడా ఉన్నాయి. సోషల్ మీడియాపై అధిక ఆధారపడటం, తక్షణ ఫలితాలను ఆశించడం, మానసిక ఒత్తిడి పెరగడం, పూర్తి సమాచారం లేకుండానే అభిప్రాయాలు ఏర్పరచుకోవడం వంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే ఈ బలహీనతలు జెన్ జీకి మాత్రమే పరిమితం కావు. వేగంగా మారుతున్న డిజిటల్ ప్రపంచం మొత్తం సమాజం ముందుంచిన సవాళ్లు ఇవి.

### యువశక్తికి సరైన దిశ అవసరం

అందువల్ల జెన్ జీని విమర్శించడం కంటే, వారి శక్తిని సరైన దిశలో మలచడం అవసరం. ప్రభుత్వాలు యువతను నిర్ణయ ప్రక్రియల్లో భాగస్వామ్యం చేయాలి. విద్యాసంస్థలు కేవలం మార్కులకే పరిమితం కాకుండా విమర్శనాత్మక ఆలోచన, పరిశోధన, నైపుణ్యాధారిత విద్య, మీడియా అవగాహనకు ప్రాధాన్యం ఇవ్వాలి. కుటుంబాలు యువతతో సంభాషణ పెంచాలి. మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించాలి. ప్రశ్నించే యువతను అణచివేయడం కంటే బాధ్యతాయుతంగా ఆలోచించేలా ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికి మరింత మేలు చేస్తుంది.

### ప్రశ్నలతో కాదు... పరిష్కారాలతోనే నిజమైన నాయకత్వం

జెన్ జీ కేవలం ఒక వయస్సు వర్గం కాదు. అది ప్రపంచం వేగంగా మారుతోందనే వాస్తవానికి ప్రతీక. ఈ తరం రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. ఆర్థిక వ్యవస్థను కొత్త దిశలో నడిపిస్తోంది. సాంకేతిక విప్లవానికి నాయకత్వం వహిస్తోంది. సామాజిక చర్చలకు కొత్త అర్థాన్ని ఇస్తోంది. ప్రశ్నించడం ఈ తరం బలం. కానీ ఆ ప్రశ్నలకు బాధ్యత, వాస్తవ నిర్ధారణ, ప్రజాస్వామ్య విలువలు జతకావాలి. స్వేచ్ఛకు క్రమశిక్షణ, సాంకేతికతకు నైతికత, ఉద్యమాలకు నిర్మాణాత్మక దిశ కలిసొస్తేనే జెన్ జీ నిజమైన పరివర్తనకు ప్రతీకగా నిలుస్తుంది. భవిష్యత్తు వారికి వారసత్వంగా లభించదు; వారు ఈరోజు తీసుకునే నిర్ణయాలతోనే దానిని నిర్మించుకుంటారు. ప్రపంచాన్ని అనుసరించే తరం కాదు జెన్ జీ... ప్రపంచానికి కొత్త దిశ చూపించే సామర్థ్యం ఉన్న తరం.

## ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి...

- **ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించిన వైస్ చైర్‌పర్సన్**



**ఉమ్మడి రంగారెడ్డి/ శంకర్ పల్లి, ఆగస్టు 04, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బోనాల మహోత్సవాల సందర్భంగా శంకర్ పల్లి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వైస్ చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలు అందించి వేదమంత్రాల నడుమ ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారు అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని అన్నారు. శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని ప్రతి కుటుంబంపై ఎల్లమ్మ తల్లి కరుణాకటాక్షాలు ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. మున్సిపల్ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఇంటా ఆనందం, శ్రేయస్సు, సంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలోపేతం కావాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఫతేపూర్ బ్రిడ్జిపై ప్రమాదకర గుంత...

- ప్రమాదాల ముప్పు

**వెంటనే శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి...**

**ఉమ్మడి రంగారెడ్డి/ శంకర్ పల్లి, ఆగస్టు 04, (నవజ్యోతి ప్రతినిధి శివారెడ్డి) :**



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని ఉన్న ఫతేపూర్ బ్రిడ్జిపై ప్రమాదకర గుంత ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల నుంచి శంకర్ పల్లి కి వచ్చే ప్రధాన రహదారిపై బ్రిడ్జి ప్రారంభ భాగంలో ఏర్పడిన గుంతతో పాటు బ్రిడ్జి స్లాబ్‌లోని ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొంది. ప్రతిరోజూ వందలాది ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుండగా, గుంత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో, అలాగే వర్షాల కారణంగా గుంత స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదుపు తప్పిన వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ప్రమాదకర గుంతను అత్యవసరంగా పూడ్చడంతో పాటు దెబ్బతిన్న బ్రిడ్జి భాగాన్ని శాశ్వతంగా మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే మరమ్మతులు పూర్తయ్యే వరకు హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు, రాత్రి సమయంలో ప్రతిబింబించే సూచికలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రోడ్డు మెరిసింది...ప్రాణాల భద్రత మసకబారింది!

- బొడ్డురాయి–ఓక్‌రిడ్జ్ రోడ్..'డేంజర్ జోన్'గా మారిందా?
- వారానికో ప్రమాదం...ముగ్గురు ప్రాణాలు పోయినా? మారని పరిస్థితి
- ఎగ్జిట్–4A తెచ్చిన ట్రాఫిక్...పెంచిన ప్రమాదాల భయం

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి) :**

అభివృద్ధి అంటే కేవలం రోడ్లను వెడల్పు చేయడం మాత్రమే కాదు... ప్రజల ప్రాణాలను కాపాడే భద్రతా ప్రమాణాలు కల్పించడమూ అంతే ముఖ్యమనే విషయాన్ని బౌరంపేట–ఓక్‌రిడ్జ్ ప్రధాన రహదారి మరోసారి గుర్తు చేస్తోంది. దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట బొడ్డురాయి నుంచి ఓక్‌రిడ్జ్ స్కూల్ వరకు విస్తరించిన ఈ రహదారి ప్రస్తుతం ప్రమాదాల పరంపరకు వేదికగా మారింది. రహదారి విస్తరణ అనంతరం వాహనాల వేగం పెరిగినా, భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో ప్రతి రోజు ఈ మార్గంలో ప్రయాణించే వేలాది మంది ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వేగానికి బ్రేక్ లేదు...ప్రమాదాలకు అడ్డుకట్ట లేదు**

రోడ్డుపై తగిన వీధి దీపాలు లేకపోవడం, డివైడర్ల మధ్య అనియంత్రిత గ్యాప్‌లు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వంటి లోపాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో వెలుతురు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఢీకొనే ఘటనలు పెరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు.

**ఓఆర్ఆర్ అనుసంధానంతో ట్రాఫిక్ భారం రెట్టింపు**

ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ నంబర్–4Aకు ఈ రహదారి అనుసంధానమై ఉండటంతో ప్రగతి నగర్, బౌరంపేట,



బహదూర్‌పల్లి, మల్లంపేట తదితర ప్రాంతాల నుంచి భారీగా వాహనాలు ఈ మార్గాన్ని వినియోగిస్తున్నాయి. వందలాది స్కూల్ బస్సులు, ట్రావెల్స్ బస్సులు, కంటైనర్లు, లారీలు, ఐటీ ఉద్యోగుల వాహనాలు ఒకేసారి ప్రయాణించడంతో రహదారి ఎప్పుడూ రద్దీగా మారుతోంది.

**వారానికో ప్రమాదం...గతంలో ముగ్గురు మృతి?**

స్థానికుల సమాచారం ప్రకారం ఈ రహదారిపై దాదాపు ప్రతి వారమూ ఒక ప్రమాదం జరుగుతోంది. గతంలో జరిగిన ఘోర ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన ఘటన ఇప్పటికీ ప్రజలను వెంటాడుతోంది. అయినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**స్కూల్ జోన్...కానీ భద్రత ఎక్కడ?**

ఓక్‌రిడ్జ్ స్కూల్ వంటి విద్యాసంస్థల కారణంగా ప్రతి ఉదయం, సాయంత్రం వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ రహదారిని ఉపయోగిస్తున్నారు. అయినా స్కూల్ జోన్ హెచ్చరిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ నియంత్రణ చర్యలు లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

**ప్రమాదం జరిగిన తర్వాతే చర్యలా?**

స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా శాశ్వత చర్యలు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత సమీక్షలు నిర్వహించడం కాకుండా, ముందస్తు భద్రతా చర్యలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# మెట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ

**జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్**

**మెట్ పల్లి. ఆగస్టు. 4 (నవ జ్యోతి ప్రతినిధి)**

జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారు ఈరోజు మెట్ పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు.అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవల పై ఎస్పీ గారు ప్రత్యేకంగా ఆరా తీశారు.




ఈ సందర్భంగా ఎస్పి గారు మాట్లాడుతూ ..... ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. ప్రజలకు భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని కావున సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు.నేరాలను ముందుగానే అరికట్టే విధంగా ఇంటెలిజెన్స్ సేకరణ, బీట్ వ్యవస్థ, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు, అనుమానిత వ్యక్తులపై నిఘా, సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

# రూ.1.16 కోట్లతో బాక్స్ డ్రైన్, భూగర్భ మురుగు కాలువ పనులకు శ్రీకారం

- మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**మీర్పేట్ హెచ్‌బీ కాలనీ, ఆగస్టు 04, (నవజ్యోతి ప్రతినిధి):**

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్, కృష్ణానగర్, తిరుమలనగర్ కాలనీల్లో రూ.1.16 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్, భూగర్భ మురుగు కాలువ నిర్మాణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీల్లో వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్,గుండారపు శ్రీనివాస్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,పార్టీ నాయకులు,



కార్యకర్తలు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# కొంపల్లి క్రోమా యూ-టర్న్‌పై ట్రాఫిక్ డీసీపీ ఫోకస్

**రద్దీ తగ్గింపే లక్ష్యం..వాహనాల కదలికలపై ప్రత్యక్ష పరిశీలన**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి) :**

కొంపల్లిలోని క్రోమా జంక్షన్ వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన కొత్త యూ–టర్న్‌ను మేడ్చల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిణి రెడ్డి, ఐపీఎస్ మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు, యూ–టర్న్ తీసుకునే వాహనాల కదలికలు, ట్రాఫిక్ ప్రవాహం, భద్రతా అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, యూ–టర్న్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేలా అవసరమైన మార్పులు చేపట్టాలని ఆదేశించారు. వాహనదారులు సులభంగా, వేగంగా, సురక్షితంగా ప్రయాణించేలా ట్రాఫిక్ నిర్వహణలో సాంకేతిక, భౌతిక మార్పులు అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, ప్రమాదాలను నివారించడం, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడం లక్ష్యంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిరంతరం చర్యలు




చేపడుతున్నారని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్న కూడళ్లను గుర్తించి, అవసరమైన చోట్ల శాశ్వత పరిష్కారాలు అమలు చేసే దిశగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. కొంపల్లి క్రోమా యూ–టర్న్ వద్ద చేపట్టిన ఈ మార్పులు అమల్లోకి వస్తే ట్రాఫిక్ ప్రవాహం మరింత మెరుగుపడటంతో పాటు వాహనదారులకు సమయపాలన, భద్రత పరంగా కూడా ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ట్రాఫిక్ ఏసిపి వై. వెంకటేశ్వర రావు , మేడ్చల్ ట్రాఫిక్ సీఐ కె. క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లుట్లలో ప్రత్యేక మహిళా గ్రామసభ



**శివంపేట, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్) :**

శివంపేట మండలం పిల్లుట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బుర్ర మురళి గౌడ్ అధ్యక్షతన ప్రత్యేక మహిళా గ్రామసభ నిర్వహించారు. గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా సమావేశం చేపట్టారు. మహిళల అభివృద్ధి, భద్రత, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇస్తామని గ్రామ సమస్యల పరిష్కారంలో వారి సూచనలు అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు అధికారులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆగిన అంగన్వాడి కేంద్రం

**ఉమ్మడి మెదక్, ఆగస్టు 04 (నవజ్యోతి ప్రతినిధి) :**



సగములో ఆగిన అంగన్వాడి కేంద్రం మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలో ఆగిపోయిన అంగన్వాడి కేంద్రం ఇంతకుముందు కూడా ఒకచోట సగంలో వేసి వదిలేశారు. ఇప్పుడు కూడా సగంలో స్లాబ్ వేసి ఆపేశారు. గర్భిణీలు బాలింతలు పిల్లలు చదువు కోవడానికి వస్తుంటారు. చెప్పడానికి అంగన్వాడి కేంద్రాలు అద్దెకు తీసుకొని నడిపిస్తున్నారు .అలా కాకుండా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అంగన్వాడి కేంద్రాలు నిర్మించాలని చెబుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నత్తనడకన పనులు నిలిపివేయడం జరిగింది.వెంటనే జిల్లా అధికారు స్పందించి వెంటనే ఆగిన అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే సంజీవరెడ్డి.



**పెద్ద శంకరంపేట్, (నవజ్యోతి ప్రతినిధి) :**

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంజరుగుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పెద్ద శంకరంపేట లోని రైతు వేదికలో పలువురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. పేదింటి ఆడపిల్లల పెళ్లిలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు ఎంతగానో తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నారాయణ. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారా గౌడ్. మధు మురళి పంతులు. మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పెరుమాండ్ల గౌడ్. ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ శాఖల్లో సిబ్బంది సంఖ్య పెంచాలని వినతి

**ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డికి వినతిపత్రం**



**ఘట్‌కేసర్,ఆగస్టు 04,(నవజ్యోతి ప్రతినిధి) :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని విభాగాల్లో సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరుతూ సామాజిక కార్యకర్త అక్కల సురేష్ కుమార్ మంగళవారం ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డిలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న సిబ్బందిపై అధిక పనిభారం పడుతున్నందున ప్రజలకు అందాల్సిన సేవల్లో జాప్యం జరుగుతోందన్నారు. అన్ని విభాగాల్లో అవసరమైన మేరకు కొత్త సిబ్బందిని నియమిస్తే ఉద్యోగులపై ఒత్తిడి తగ్గడంతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను వేగంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన, పారదర్శకమైన మున్సిపల్ సేవలు అందించేందుకు ప్రభుత్వం,సంబంధిత అధికారులు తక్షణమే అవసరమైన సిబ్బందిని నియమించాలని అక్కల సురేష్ కుమార్ కోరారు.

## వావిలాలలో అదనపు తరగతి గదుల ప్రారంభం..

### ప్రభుత్వ విద్యాభివృద్ధికి పరిశ్రమల భాగస్వామ్యం పెరగాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**పటాన్ చెరు(జిన్నారం),ఆగస్టు 4(నవజ్యోతి ప్రతినిధి):**

ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో చదువుతున్నారని, వారి విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి బాల వికాస్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొంటూ, నియోజకవర్గంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోల్డ్‌టెక్ కంపెనీ సహకారంతో బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను మంగళవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు ఇష్టపడి చదివి స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. విద్యను కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగడానికి ఒక సాధనంగా భావించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించే మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని, ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిభకు కృషి తోడైతే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని పరిశ్రమలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా విద్యారంగానికి మరింత సహకారం అందించాలని కోరారు. పాఠశాల నుంచి ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రస్తావించిన ఎమ్మెల్యే, వెంటనే సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ తాన్యను ఆదేశించారు. వావిలాల గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ తాన్య, బాల వికాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఇంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరి రెడ్డి, కౌన్సిలర్లు అశోక్, సతీష్, కో–ఆప్షన్ సభ్యుడు రవీందర్, సీనియర్ నాయకులు బాల్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, ప్రోగ్రామ్ మేనేజర్ తిరుపతి, మోల్డ్‌టెక్ పరిశ్రమ ప్రతినిధి ఉగేష్, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదలలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు..

### సాంప్రదాయాలను కాపాడుకుందామని చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పిలుపు



**పటాన్చెరు(గుమ్మడిదల), ఆగస్టు 4(నవజ్యోతి ప్రతినిధి):**

మన సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకుంటూ పండుగలను వైభవంగా నిర్వహించుకోవాలని సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. గుమ్మడిదల పురపాలక కేంద్రంలో మంగళవారం గ్రామ దేవాలయ కమిటీ, గ్రామ పెద్దలు, నాయకుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శివసత్తుల సిగాలు, పోతరాజుల విన్యాసాలు, ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపుతో గ్రామ వీధులన్నీ భక్తిశ్రద్ధలతో మారుమోగాయి. గ్రామ బొడ్డురాయి నుంచి ఎల్లమ్మ దేవాలయం వరకు సాగిన ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సిజిఆర్ ట్రస్ట్ నుంచి నగదు బహుమతులు**

గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించే లక్ష్యంతో సిజిఆర్ ట్రస్ట్ తరపున చిమ్ముల గోవర్ధన్ రెడ్డి నగదు బహుమతులు, ప్రోత్సాహక విరాళాలను అందజేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్లలో పొచుగారి పెంటారెడ్డి మోహన్ రెడ్డి ఎడ్లబండి ప్రథమ బహుమతిగా రూ.15,000, కురుమ సంఘం ఎడ్లబండి ద్వితీయ బహుమతిగా రూ.10,000 అందుకోగా, ఊరేగింపులో పాల్గొన్న మిగతా అన్ని ఎడ్లబండ్లకు రూ.5,000 చొప్పున ప్రోత్సాహక నగదు అందజేశారు. విజేతలకు తహసీల్దార్ పరమేశం, ఎస్సై అరుణ్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా, గ్రామ దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానంద రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ సభ్యులు, యువకులు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారీ వ లతో ఏఎస్ రావు నగర్ లో ట్రాఫిక్ కు అంతరాయం

- అప్రమత్తంగా స్పందించిన కుషాయిగూడ పోలీసులు
- నీరు తొలగించి రాకపోకలు పునరుద్ధరణ

**ఏఎస్ రావు నగర్ , ఆగస్టు 04,(నవజ్యోతి ప్రతినిధి) :**



కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాల కారణంగా ఏఎస్ రావు నగర్ లోని అనూ టెక్స్ సమీపంలో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే కుషాయిగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ పోలీసులతో పాటు హైడ్రా సిబ్బంది సహకారంతో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగించే చర్యలు చేపట్టారు.అదే సమయంలో ట్రాఫిక్ ను సమర్థవంతంగా నియంత్రించి వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.పోలీసులు, ట్రాఫిక్ విభాగం, హైడ్రా సిబ్బంది సమన్వయంతో వేగంగా స్పందించడంతో ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రయాణికులకు కలిగే అసౌకర్యం నివారించబడింది. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

## సాయి కృష్ణ ఎంక్లేవ్ విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- కాలనీని సందర్శించిన బొంతు శ్రీదేవి యాదవ్ – వారం రోజుల్లో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి వస్తుందని హామీ

**కుషాయిగూడ, ఆగస్టు 04,(నవజ్యోతి ప్రతినిధి) :**

కుషాయిగూడ డివిజన్ పరిధిలోని సాయి కృష్ణ ఎంక్లేవ్ కాలనీని కాంగ్రెస్ నాయకురాలు బొంతు శ్రీదేవి యాదవ్ సందర్శించి కాలనీవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, పెండింగ్ అభివృద్ధి పనులపై స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కాలనీవాసులను ఉద్దేశించి బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ, కాలనీలో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని, మరో వారం రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి వచ్చి విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. మిగిలిన అభివృద్ధి పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె చూపుతున్న చొరవను కాలనీవాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శంకర్ నాయక్, కార్యదర్శి శంకర్, నారెడ్డి తిరుపతి



రెడ్డి, హంసారావు, మురళి, అగేష్ గౌడ్, రాజు, మోహన్ రాజు, శ్రీను, శంకర్ రెడ్డి, సూర్య, వెంకటేష్, కాలనీ సలహాదారుడు, ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాసుల పోచయ్య గౌడ్, చెర్లపల్లి డివిజన్ ఉమ్మడి మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, బాల్ నర్సింహ, గోపాల్, భాను నేత తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ బస్‌స్టాప్‌కు శాశ్వత పరిష్కారం కోరుతూ వినతి

- పనగట్ల చక్రపాణి గౌడ్
- సీఐ భాస్కర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ మల్లేష్‌తో భేటీ – ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ

**కుషాయిగూడ,ఆగస్టు 04,(నవజ్యోతి ప్రతినిధి) :**

కుషాయిగూడ బస్‌స్టాప్ వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు, బస్సుల రాకపోకలకు ఆటంకంగా మారిన బారికేడ్లు, ట్రాఫిక్ చలాన్లపై ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆందోళనల పరిష్కారం కోసం కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పనగట్ల చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు కుషాయిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లెంకల భాస్కర్ రెడ్డి, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుషాయిగూడ బస్‌స్టాప్ వద్ద రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్ల కారణంగా ప్రజలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అలాగే బస్సులు సక్రమంగా నిలవలేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ట్రాఫిక్ చలాన్ల అమలులోనూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వినతిపై స్పందించిన సీఐ లెంకల భాస్కర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ మల్లేష్ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి ట్రాఫిక్ ఏసీపీ, ట్రాఫిక్ డీసీపీ దృష్టికి




తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అధికారుల సానుకూల స్పందనపై హర్షం వ్యక్తం చేసిన కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బస్‌స్టాప్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు చల్లా ప్రభాకర్, కొడకండ్ల యాదయ్య, రేగొండ వెంకటేశ్వర్లు, పండాల గణేష్ గౌడ్, బ్రహ్మ చారి, నాలచెరువుల జనార్దన్, పిట్టల రాజు ముదిరాజ్, చినంగిని దయానంద్, రమేష్ చౌదరి, నాగరాజు, సకరామ్ చౌదరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## శుభోదయ కాలనీ ఫేజ్-1లో బొంతు శ్రీదేవి యాదవ్ పర్యటన

### పెండింగ్ అభివృద్ధి పనులను పరిశీలించి త్వరలో పూర్తి చేస్తామని హామీ

**కుషాయిగూడ,ఆగస్టు 04,(నవజ్యోతి ప్రతినిధి) :**

కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ ఫేజ్–1లో నెలకొన్న పలు సమస్యలను పరిశీలించేందుకు కాంగ్రెస్ నాయకురాలు బొంతు శ్రీదేవి యాదవ్ మంగళవారం కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా,వీధి దీపాలు తదితర పెండింగ్ అభివృద్ధి పనులను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన మొదటి ప్రాధాన్యత అని



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కాసుల మహేందర్ గౌడ్, రవీందర్ రావు, వెంకట్ రెడ్డి, యాదగిరి గౌడ్, వాసు, తారకేష్, జగదీష్, కృష్ణ రెడ్డి, ఇలేష్, ప్రేమ్ నాథ్, ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసుల పోచయ్య గౌడ్, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, బత్తుల శ్రీకాంత్ యాదవ్, మైలారం బాల్ నర్సింహ, రఘు గౌడ్, శ్రీను, గోపాల్, భాను నేత, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఐడీఏ బొల్లారంలో ఆకస్మిక వాహన తనిఖీలు..

### 12 వాహనాలు సీజ్

**పటాన్‌చెరు,ఆగస్టు 4(నవజ్యోతి ప్రతినిధి):**

ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని బొల్లారం సర్వీస్ రోడ్డుపై మంగళవారం ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో చెల్లుబాటు అయ్యే వాహన పత్రాలు లేని, నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లు కలిగిన 12 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.తనిఖీల సందర్భంగా వాహనదారులకు పోలీసులు అవగాహన కల్పిస్తూ, వాహనాలకు సంబంధించిన అన్ని చట్టబద్ధమైన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు. అలాగే మోటారు వాహన చట్టం ప్రకారం నిబంధనలకు అనుగుణమైన నంబర్ ప్లేట్లను మాత్రమే వినియోగించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ అక్షిత, ఎస్ఐ కిష్టారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వారాంతపు సంతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి:

### ఏఎంసి చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ

**నడిగూడెం, ఆగస్టు 4 (నవజ్యోతి ప్రతినిధి) :**

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వారాంతపు సంతను మండల వ్యాప్తంగా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ కోరారు. మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ మరియు పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వారాంతపు సంతను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలకు ఈ వారాంతపు సంత ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండల అభివృద్ధికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిల సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించిన వారాంతపు సంతతో పాటు, రవాణాకై ఏర్పాటు చేసిన బస్సు సౌకర్యాన్ని కూడా ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.సర్పంచ్ దున్నా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన, తాజా కూరగాయలను సరసమైన ధరలకే అందించాలని వ్యాపారులను కోరారు. గ్రామ ప్రజల ఆకాంక్షల మేరకే ఈ సంతను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల



ఆశీస్సులతో, ప్రజల సహకారంతో పాలకవర్గ సభ్యులను కలుపుకొని గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు శ్రమిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలుగురి నాగరాజు, వార్డు సభ్యులు లింగయ్య, మనీషా, విజయ్, నాగరాజ్, రామకృష్ణ, సరస్వతి, రాము, సతీష్ కుమార్, శైలజ, మహేందర్ ప్రసాద్, మాధవి, గోపినాథ్, మాజీ సర్పంచులు నాగలక్ష్మి, మల్లేష్ యాదవ్, సత్యనారాయణ, సుధాకర్, మాజీ ఎంపీటీసీ పందిరి వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు మరియు ప్రజలు పాల్గొన్నారు

Printed, Published, Owned by MANNE LAXMAN Printed at Saketh Publications, 312, Trinetra Complex, Sangareddy, Telangana 502001 Published from SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001 P.H: 9908123780, Email:navajyothinews@gmail.com, RNI no. TGTEL/25/A2372, EDITOR: MANNE LAXMAN